ఈ కల్తీ ప్రపంచంలో విషంతాగి ఆత్మహత్య చేసుకోవాలనే అతని కోరిక నెరవేరిందా?




# బొమ్మ బొరుసు

త్రను చనిపోవాలి

తప్పుదు ఆ తకన్నా చేయదగిన గొప్ప పనేం కనుచూపు మేరలో కనబడడంలేదు.

"డియర్ నరేన్, నిజంగానే నీవంటే నాకెంతో ప్రేమ కాని కేవలం ప్రేమతో మనం ఈ ప్రపంచంలో బ్రతకలేం కదా. ముందు మీ చెల్లెలి పెళ్ళిచేయడానికి ప్రయత్నించు అంతదాకా నాకూ పెళ్ళిగాకుండా ఉంటే నిన్నే తప్పక చేసుకుంటాను"

జ్యోతి రాసిన ఉత్తరంలోని ప్రతి మాటా తనకింకా జ్ఞాపకమే. ఎంత కఠినంగా రాసింది!

అంతేలే, అంతకన్నా ఏం రాయగలదు! ఆడపిల్ల లెప్పుడు ప్రేమను వాస్తవంలోంచే కదా చూస్తారు!

అమ్మా, నాన్నా క్షమించండి.

కళ్ళనిండా కలల్ని నింపుకున్న చెల్లీ క్షమించు, క్షమించు' ని అన్న వొట్టి నిర్భాగ్యుడు!! నిరుద్యోగి!!

"కురు వృద్ధుల్, కురు వృద బాంధవు లనేకుల్" వేచియుండ తన కెప్పుడు ఉద్యోగం దొరికేది?

ప్చ్, ఈ జీవితానికింతే!

ప్రేమించిన జ్యోతి తనకు గాకుండా పోతుంది జీవితంలో మిగిలున్న ఆ కొద్ది ఆశా ఆవిరయి పోయింది

తనొక వ్యర్థజీవి బ్రతికి ఇంకొకరికి భారమయ్యేదే తప్పా చేయుగలిగిందేమీలేదు.

అదుగో—పోస్టుమాన్ వస్తున్నాడు. ఏదో ఉత్తరం పక్కింట్లో పడవేస్తున్నాడు. తన గది ముందు అరసెకండయినా ఆగకుండా వెళ్ళిపోతున్నాడు.



'తను కోరుకున్న జ్యోతి ఎప్పటికీ తనదే అనే భావన ఇన్నాళ్ళుగా ఎన్నో సమస్యల్ని ఆలోచింపజేయలేదు గుండె నిండా ఎంతో నమ్మకం భవిష్యత్తుపై త్వరలో ఉద్యోగం దొరుకుతుంది. జ్యోతిని పెళ్ళి చేసుకుంటాడు. చెల్లెలి పెళ్ళిచేసి తల్లి దండ్రును తన దగ్గరే ఉంచుకొని వారికి కించిత్తు కష్టం కలుగకుండా చూసు కుంటాడు–ఇవీ అతని ఆశాజనకమైన ఆలోచనలు !

"కేవలం ప్రేమతో ఈ ప్రపంచంలో బ్రతికలేం కదా" ఒక్కమాటతో తనను ఊహల్లోంచి వాస్తవానికి రప్పించి వెళ్ళిపోయింది. ఇప్పుడనుకుంటాడు - ఇన్నాళ్ళూ నిశ్చింతగా ఎలా జీవించగలిగానా - అని.

అన్ని రకాలుగా ఓడిపోయిన తనకు మిట్ట మధ్యాహ్నం వేళ సహారా ఎడారిలో ఒంటరిగా ప్రయాణిస్తున్న భావన తప్ప ఇంకే ఆలోచనా కలగడం లేదు.

అప్పుడనిపించింది - ఇక జీవించ కూడదని.

పలాయన వాదం!

కాలేజీలో చదువుతున్నప్పుడు ఈ 'ఎస్కేపిజం' గురించి ఆవేశంగా మాట్లాడుతున్నప్పుడు - జ్యోతి విప్పారిన కళ్ళతో ఎంత మెచ్చుకోలుగా చూసిందని! అప్పుడు మొదటి బహుమతి అందుకున్న ఆనందం కంటే జ్యోతి 'కంగ్రాట్స్' చెప్పినప్పుడే ఎంత పొంగి పోయాడని!!

చనిపోవడానికి నిర్ణయించుకున్న తరువాత - ఎలా చనిపోవాలని ఆలోచించాడు - ఏ రకంగానైనా హాయిగా చనిపోవాలి!

ఉరేసుకొని చనిపోదామంటే తాడు మెడకు బిగుసుకొని, ఊపిరాడక గిలగిలా కొట్టుకోవాలి. ఏ బస్సు కిందో, రైలు క్రిందో పడదామంటే మెడ విరిగి, తల పగిలి, మెదడు చిట్లి - ఆ దృశ్యం ఊహించుకుంటేనే కడుపులో తిప్పుతుంది. ఏదైనా ఎత్తైన బిల్డింగు పైనుంచి దూకుదామంటే, కాలో చెయ్యో విరిగి ప్రాణం పోకుండా ఉంటే అంతకన్నా దుర్భరమైన జీవితం మరొకటుండదు. అన్నిటికన్నా సులభమైనది - విషం త్రాగడం!

దృఢ చిత్తంతో లేచి బట్టలు ధరించి, దగ్గరలో ఉన్న దుకాణం వరకెళ్ళాడు. మందుకొని చాలా మామూలుగా తిరిగి వచ్చాడు.

అతని మనసిప్పుడు ఏ భావావేశాలకూ స్పందించని నిర్లిప్తతలో కూరుకుపోయింది. గది తలుపు గడియ వేసి వచ్చి మంచంపై కూర్చొని సీసా మూత తీశాడు.

'నిరుద్యోగం జిందాబాద్ - నిరుద్యోగి ముర్దాబాద్' అని రాసి చనిపోదామా లేక 'విశ్వ ప్రేమ జిందాబాద్ - విఫల ప్రేమికుడు ముర్దాబాద్' అని రాద్దామా?

ఛ ఛ, వద్దు వద్దు! అలా రాస్తే నిరుద్యోగి ఆత్మహత్య అనో భగ్న ప్రేమికుడు ఆత్మార్పణం అనో పేపర్లో వేస్తారు. ఆ ముద్ర తనకవసరం లేదు. తన చావు గురించి ఎవరేమైనా అనుకోనీ - ఈ వార్త విని జ్యోతి రెండు కన్నీటి బొట్లు రాల్చనీ!

కనిపెంచిన అమ్మా నాన్నలకు, తోడబుట్టిన చెల్లికి క్షమాపణలు!

ప్రేమించిన జ్యోతికి ఆశీస్సులు!

ఆపదల్లో ఆదుకున్న స్నేహితులకు కృతజ్ఞతలు!

తనని స్థితికి దిగజార్చిన ఈ అస్తవ్యస్తమైన వ్యవస్థకు మాత్రం నమస్కారాలు! శతకోటి నమస్కారాలు!!

సీసా ఎత్తి ఒక్క గుక్కన త్రాగగలిగినంత త్రాగేసి సీసాను ప్రక్కన పడేసి మంచంపై అలాగే పడిపోయాడు.

గాజు గ్లాసును చూర్ణంచేసి మింగితే ఉండే కోత - కడుపులో! ఆ బాధను భరించలేక మంచంపైనుండి క్రింద పడిపోయాడు కూడా.

మనసులోనుండి మెల్లిమెల్లిగా తల్లిదండ్రుల రూపాలు, జ్యోతి అందమైన నవ్వూ అదృశ్యమైపోతున్నాయి. భరించలేని బాధలో గది నేలంతా అప్రయత్నంగానే దొర్లిపోతున్నాడు

అప్పుడు వినిపించింది తలుపు తట్టిన చప్పుడు

"నరేంద్రగారూ, నరేంద్రగారూ" పిలుస్తున్నారెవరో బయటినుండి

ఆ చప్పుడూ, ఆ గొంతు అస్పష్టంగా వినిపించాయతనికి. ఆ తరువాత తలుపు తడుతున్న చప్పుడు ఇంకా తీవ్రమైంది.

* * *

మత్తుగా, బలవంతంగా కళ్లు తెరచాడు అంతా అస్పష్టంగా కనబడుతుంది.

తనిప్పుడెక్కడున్నాడు?

స్వర్గంలోనా, నరకంలోనా!

అయితే ఇంద్రుడేడీ, రంభా ఊర్వశులేరీ? పోనీ యముండేడి, చిత్రగుప్తుని చిట్టా ఎక్కడ? తనకయితే తను ఖచ్చితంగా నరకంలోనే ఉన్నాననిపిస్తుంది.

పని చేయడంలో మెదడుకు చురుకుదనం ఎక్కువవుతుంది. తెల్లని గోడలు, తెల్లని బట్టలు, వరుసగా మంచాలు— సందేహం లేదు, ఈ వాసన కూడా అదే— తనిప్పుడు ఆసుపత్రిలో ఉన్నాడు

అప్పుడు తన ప్రక్కన నిలబడి తన వంక ఆదుర్దాగా చూస్తున్న పక్కింటాయన పరమేశ్వరం కనిపించాడతనికి "ఇంకేం పరవాలేదు" అంటున్న డాక్టరు మాటలు వినిపించాయి

"అమ్మయ్య, కళ్లు తెరచారా, నేను పరమేశ్వరాన్నండీ, గుర్తుపడతున్నారా?" అడుగుతున్నాడతను.

"నేనిక్కడికి ఎలా వచ్చాను?" శక్తినంతా కూడదీసుకుంటూ అడిగాడు నరేంద్ర.

"నేనెంత తలుపు తట్టినా మీరు తెరవకపోయేసరికి అందర్నీ పిలిచి తలుపు బద్దలు కొట్టించానండీ..." ఎంతో సంతోషంగా చెప్పుకుపోతున్నాడాయన

"అయ్యో, నన్నెందుకు బతికించారండీ, మీకు తెలీదండీ నేను అన్ని రకాలుగా ఓడిపోయి, నిరాశపడి చనిపోవాలనుకున్నాను. మీరెంతో పొరబాటు చేశారు"

## పథకం



"జనాభా తగ్గింపు కోసం మీరు అమలుపరుస్తున్న కొత్త పథకాలు ఏవిటి?" అడిగాడు విలేఖరి మంత్రిగారిని.

"కొత్తగా రైళ్ళను, లెవల్ క్రాసింగులను ఎక్కువ చేస్తున్నాం" చెప్పారు మంత్రిగారు

—జి. యస్. శర్మ (అమలాపురం)

కళ్లనుండి కన్నీరు చిప్పిల్లుతుండగా బాధతో అన్నాడు

బదులుగా చిన్నగా నవ్వాడు పరమేశ్వరం "అప్పుడే తిట్టకండి గురుగారూ. మీరు నిజంగానే ఎంతో అదృష్టవంతులు. సర్వీస్ కమీషన్ నుండి మీకు ఇంటిమేషన్ వచ్చింది ఇవ్వాళే. గ్రూప్ టూ–బి పరీక్షలో మీరు పాసయ్యారనీ, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న మిమ్మల్ని సెలక్టుచేసి, హెల్త్ డిపార్టుమెంటుకు అలాట్ చేసారనీ, ఆ డిపార్టుమెంటు వారు త్వరలో మీకు అపాయింట్ మెంట్ ఆర్డరు పంపుతారనీ... పోస్టుమ్యాన్ ఆ కవరును మా ఇంట్లోపడేసి వెళ్ళాడు" ఇంకా ఆగకుండా గబగబా చెప్పుకుపోతున్నాడు పరమేశ్వరం.

ఆశ్చర్యం, ఆనందం, ఉత్తేజం, ఉద్రేకం–ఎన్నో భావాలు! అన్నీ కలగలిసిపోయి కృతజ్ఞత నిండిన కళ్ళతో అతని వంక చూస్తుండిపోయాడు నరేంద్ర.

ఆ కళ్ళల్లో జ్యోతి రూపం ప్రకాశవంతంగా వెలిగిపోతుంది. చెల్లెలి నవ్వు కనిపిస్తుంది. తల్లిదండ్రుల సంతోషం గోచరిస్తుంది.

తనున్నది ఆసుపత్రిలా కనిపించడం లేదు స్వర్గం! నిజంగా స్వర్గంలానే ఉంది. పరమేశ్వరం దేవేంద్రుని కంటే ఎన్నోరెట్లు గొప్పవానిలా ఉన్నాడు

కిటికీలోంచి నగరమంతా పచ్చగా కళకళలాడుతున్నట్లుగా ఉంది. అందరూ, తన ప్రక్కనున్న రోగులు సైతం ఎంతో సంతోషంగా ఉన్నట్లుగా కనిపిస్తున్నారు

"...మీరు అదృష్టవంతులనడానికి ఇంకో విషయం చెప్పనా?" అడుగుతున్నాడు పరమేశ్వరం

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడతను.

"మీరు త్రాగిన విషం మంచిదైతే మేం తలుపు తీసేసరికి మీ ప్రాణం పోయుండేది"

'ఆ విషం కల్తీది కాబట్టి ఎక్కువ పని చేయలేదు. అది కల్తీది కావడం వల్లనే మీరు బ్రతికారు''

ఇంకా ఆశ్చర్యంగా చూశాడతని వంక.

చివరికి విషంలోనూ కల్తే! నవ్వొచ్చింది నరేంద్రకు. అలా కల్తీ జరగడమే తనకు లాభమయింది లేకుంటే తన చావు వ్యర్థమయేది.

ఒక్క మూడు గంటల కాలంలో ఎంత మార్పు! తను చనిపోయి బ్రతికాడు, జన్మలో రాదనుకున్న ఉద్యోగం వచ్చింది ఎంతో ఎంతో అదృష్టవంతుడు తను

కల్తీ అనేది ఎంతోమంది ప్రాణాలు తీస్తున్నప్పుడు అదే కల్తీ తన ప్రాణాల్ని కాపాడింది ఇది నిజంగా అద్భుతమే.

కల్తీ–జిందాబాద్!

కల్తీ–కలకాలం వర్ధిల్లా!!

రేపే బయలుదేరాలి మొదట జ్యోతి వాళ్ళ ఊరెళ్ళాలి. ఈ శుభవార్త చెబితే ఎంత సంతోషపడుతుందో. తన ఆత్మహత్యాయత్నం విని ఎంత కంగారుపడి ఏడ్చేస్తుందో.

ఉద్యోగంలో జాయినయిన వెంటనే పెళ్ళి చేసుకోవాలి తరువాత చెల్లెలికి మంచి సంబంధం చూసి చేసేయాలి.

ఉద్యోగమొచ్చిన సంగతి విని అమ్మ ఎంత సంబరపడిపోతుందో - 'నాన్నా. ఇక నిన్ను ఏమాత్రం కష్టపడనివ్వను నువ్విక కాలుమీద కాలేసుకొని నిశ్చింతగా ఉండ వచ్చు'

ఈ దుర్ఘటనను వారితో చెప్పవద్దు తట్టుకోలేరు.

"థాంక్సండీ, పరమేశ్వర్‌గారూ! మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను. మీరు నాకో కొత్త జీవితాన్ని ప్రసాదించారు. మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. మీరు నన్నొక్కర్నే కాదు మా కుటుంబాన్నే నిల బెట్టారు" ఆనందంతో పూడుకుపోయిన గొంతులో అతని కృతజ్ఞతా భావం స్పష్టంగా ధ్వనించింది.

"ఇదంతా మీ అదృష్టమే కానీ నేను చేసిందేముంది లెండి. సాటి మనిషిగా నా ధర్మాన్ని నిర్వర్తించానంతే"

"చనిపోవాలనుకున్న నాకే ఇప్పు డేమనిపిస్తుందో తెలుసాండి, కొన్ని సంవత్స రాలు కాదు ఎన్నో సంవత్సరాలు చావు అనేది లేకుండా జీవించాలనిపిస్తుంది. మరణం గురించి తలుచుకుంటేనే భయ మేస్తుంది..." డాక్టరు రావడంతో మాటలు ఆపుచేశాడు నరేంద్ర

"హల్లో యంగ్ మాన్, హవార్యూ ఫీలింగ్?" చిరు నవ్వుతో ప్రయత్నించాడు డాక్టరు

"క్వయిట్ ఆల్ రైట్ సర్"

"చివరగా ఈ ఇంజక్షనొక్కటి చాలు, రేపు మిమ్మల్ని డిశ్చార్జి చేస్తాము" నర్స్ తెచ్చిన ట్రేలోని సిరంజి తీసుకుంటూ అన్నాడు.

"సరే సర్"

చరుక్కున మంట కలిగిస్తూ మెత్తగా దిగింది సిరంజినీడిల్. జరజరా ప్రవహించింది మందు.

వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కొని ఇంకో రెండు మూడు అర్జంటు కేసులను చూసి వార్డులోంచి వెళ్ళిపోతున్నాడు డాక్టరు

సరిగ్గా అప్పుడే, నరేంద్రను చూస్తూ నిలబడ్డ పరమేశ్వర్ అదిరిపడ్డాడు.

నరేంద్ర కళ్ళనిండా భయం. అయోమయం! గుండెను పట్టుకొని ఊపిరాడక ఉండలు చుట్టుకుపోతున్నాడు.

"డాక్టరు" అంటూ ఒక్క అంగలో పరిగెత్తుకెళ్ళి కారిడార్‌లో డాక్టరును కలుసుకున్నాడు

కంగారుగా డాక్టరు, నర్స్ పరిగెత్తు కొచ్చారు అప్పటికే అతని పరిస్థితి విష మించింది. ఏం మాట్లాడలేకపోతున్నాడు.

నర్స్ ఆక్సిజన్ మాస్క్ తగిలించింది రెస్పిరేషన్ కొరకు

అనుమానంగా డాక్టర్ వేస్ట్ బాక్స్‌లోని ఖాళీ బాటిల్‌ను పైకి తీశాడు దానిలోంచే తనింతవరకు మందు తీసి ఇంజెక్టు చేసింది.

కల్తీ!!

నిస్సహాయమైన కోపంతో డాక్టరు ఆ బాటిల్‌ను నేలకేసి కొట్టాడు ఆ సీసా చిన్నదే అయినా ఆ శ్మశాన నిశ్శబ్ద వాతా వరణంలో భయంకరమైన చప్పుడుతో పగిలిపోయింది. ఆ చప్పుడు మామూలు చిన్న సీసా పగిలిన చప్పుడులా లేదు. కల్తీరాక్షసి చేస్తున్న వికటాట్టహాసంలా ఉంది.

తన ప్రాణం పోతుందని తెలుస్తూనే ఉంది నరేంద్రకు. అంతటి స్థితిలోనూ ఎందుకో నవ్వు వచ్చిందతనికి అయితే ఆ నవ్వు గొంతులోనే ఆగిపోయింది! *